గోసంరక్షణకు ప్రణాళికలు సిద్ధం

- వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీప ప్రాంతాల్లో గోశాలలను నిర్మిస్తున్నాం
- 'పీపుల్ ఫర్ యానిమల్స్' అధ్యక్షురాలు మేనకాగాంధీతో సిఎం రేవంత్‌రెడ్డి

మనతెలంగాణ/హైదరాబాద్:రాష్ట్రంలో గోసంరక్షణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఆధునిక సౌకర్యాలతో విశాల ప్రదేశంలో ఎన్నేపల్లిలో గోశాల నిర్మాణం చేస్తున్నామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకాగాంధీ బృందానికి వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీప ప్రాంతాల్లో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సిఎం చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డితో మేనకాగాంధీ బృందం ఆదివారం శాసనసభ సమావేశ హాల్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ చర్యలపై అధికారులు వివరించారు. వీధికుక్కలకు స్టెరిలైజేషన్ పై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. జంతువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను అధికారులు మేనకాగాంధీ బృందానికి తెలియజేశారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్‌ల కమిషనర్‌లు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించారు. జంతువుల పట్ల క్రూరత్వాన్ని అరికట్టడానికి వాటికి మెరుగైన వసతులు కల్పించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను అధికారులు వివరించారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై మేనకాగాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా మేనకాగాంధీ కొనియాడారు. ప్రభుత్వం చూపిస్తున్న చొరవను అభినందిస్తూ జంతువుల సంక్షేమం పట్ల ఇదే నిబద్ధతను కొనసాగించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో పాటు పలువురు మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

అమెరికా బానిసత్వంలో తరిస్తున్న మోడీ

- పశ్చిమాసియా యుద్ధ నివారణకు ప్రధాని చొరవ తీసుకోవాలి
- కాంగ్రెస్, వామపక్షాల డిమాండ్
- చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకూ యుద్ధ వ్యతిరేక ర్యాలీ

మన తెలంగాణ/హైదరాబాద్ : అమెరికా బానిసత్వంలో తరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ విశ్వగురువు నని చెప్పుకోవడం సిగ్గుచేటని పలువురు వక్తలు విమర్శించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దాడిని నిలువరించేందుకు ప్రధాని మోడీ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. యుద్ధ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధాన్ని నిరసిస్తూ చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, టిజెఎస్, సి పి ఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా , రైతు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుద్ధానికి, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యుద్ధ నివారణకు ప్రధాని చొరవ తీసుకోవాలని శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం ఎగ్జిబిషన్ మైదానంలో టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్. కె. నారాయణ మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా రాక్షసత్వానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ సంపద ఉంటే అక్కడ దాడులకు పాల్పడుతూ ఆ దేశాలను హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నాడని, ప్రపంచ దేశాలు ఏకమై దీనిని అడ్డుకోవాల్సిన అవసరముందన్నారు.ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఎలాంటి కారణం లేకుండానే ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధంతో సామ్రాజ్యవాదం అసలు స్వరూపం ప్రజల ముందు ఆవిష్కృతమైందన్నారు. యుద్ధం పేరుతో మానవత్వ విలువలను ధ్వంసం చేస్తూ అమాయక ప్రజలను అత్యంత అమానవీయంగా చంపడం టెర్రరిజం కాదా అని ప్రశ్నించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ. రియాజ్ మాట్లాడుతూ ఇరాన్ దేశంతో మన దేశానికి అవినాభావ సంబంధాలు ఉన్నాయని వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ప్రధాని మోడీ వ్యవహరించడం సరికాదన్నారు. సిపిఎం జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ యుద్ధానికి వ్యతిరేకంగా బ్రిక్స్‌లో 4 దేశాలు వ్యతిరేకంగా మాట్లాడితే బ్రిక్స్‌కు అధ్యక్షుడుగా ఉన్న ప్రధాని మోడీ మాత్రం కనీసం ఖండించే సాహసం కూడ చేయకపోవడం సిగ్గుచెట్టాన్నారు.

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పొటు రంగారావు మాట్లాడుతూ ప్రపంచ మానవళికి వ్యతరేకం గా జరుగుతున్న ఆధర్మ యుద్ధాన్ని తక్షణమే నిలి పి వేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సిపి ఐ (ఎంఎల్) మాస్ లైన్ అధికార ప్రతినిధి చలపతి రావు మాట్లాడుతూ గతంలో ఇజ్రాయెల్, పాలస్తీనాపై దాడి చేసినప్పుడు ప్రపంచ దేశాలు వ్యతిరేకించకపోవడంతో దానిని ఆసరాగా తీసుకుని ఇప్పుడు ఇరాన్‌పై దాడికి పాల్పడుతోందన్నారు.

గుజరాత్‌లో దళితులపై కక్ష

రాహుల్ తీవ్ర విమర్శ

న్యూఢిల్లీ: గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వ హయాంలో దళితుల అణచివేత ఎక్కువ అయిందని కాంగ్రెస్ నేత, ఎంపి రాహుల్ గాంధీ విమర్శించారు. బిజెపి సంకుచితవాదంతో విద్వేషకర వాతావరణం నెలకొంది. దళితులు, ఆదివాసీ వర్గాలపై దాడులు , వారిపట్ల వివక్ష పెరుగుతోందని అన్నారు. గుజరాత్‌కు చెందిన దళితులు, ఆదివాసీలతో తాను ఇటీవల మాట్లాడినప్పుడు , వారి సాధకబాధకాలు తెలిసివచ్చాయని ఆయన సోషల్ మీడియా ద్వారా స్పందించారు. వారి సాధకబాధకాలను తెలియచేయాల్సిన కనీస బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. 2016 ఉన్నా దారుణ ఉదంతం బాధితుల పట్ల తాము పూర్తిగా సంఘీభావం వ్యక్తం చేస్తున్నామని, వారికి పూర్తి స్థాయి న్యాయం జరిగే వరకూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తనను కలిసిన బాధితులలో ఉన్న దళితులు కూడా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.

నేడు అశ్వరావుపేట ఆయిల్ పామ్ తోటల సందర్శనకు కొడంగల్ రైతులు

మనతెలంగాణ/హైదరాబాద్ :ఆయిల్ పామ్ సాగుపై రైతులను ప్రోత్సహించడంలో భాగంగా కొడంగల్ రైతులు సోమవారం అశ్వరావుపేటలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు వెళ్లనున్నటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడంగల్ ప్రాంతం లో ఆయిల్ పామ్ విస్తీర్ణం పెరిగేలా, ఆయిల్ పామ్ పంటపై రైతులకు ఆసక్తి పెంపొందించడానికి సోమవారం కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన నారాయణపేట జిల్లాలోని నాలుగు మండలాలు, వికారాబాద్ జిల్లాలలోని నాలుగు మండలాల నుండి 92 మంది ఔత్సాహిక రైతులను అశ్వరావుపేటలోని పామాయిల్ తోటల సందర్శనకు పంపిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

బల్విందర్ సింగ్ జమ్మూ

డి.సోమసుందర్

వై.నరేందర్ రెడ్డి

ఐజేయూ అధ్యక్షుడిగా బల్విందర్ సింగ్ జమ్మూ

ఉపాధ్యక్షుడిగా వై.నరేందర్‌రెడ్డి , సెక్రటరీ జనరల్‌గా డి.సోమసుందర్ ఎన్నిక

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. ఐ.జే.యు. అధ్యక్షునిగా బల్విందర్ సింగ్ జమ్మూ (పంజాబ్) , సెక్రటరీ జనరల్‌గా డి.సోమసుందర్ (ఆంధ్రప్రదేశ్) గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వారు ప్లీనరీ వేదికపై ఆదివారం తమ బాధ్యతలు చేపట్టారు. మిగిలిన ఆఫీస్ బేరర్ పోస్టులకు, కార్యవర్గ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ఆదివారం జరిగింది. ఐజేయూ జాతీయ కార్యవర్గం సీనియర్ పాత్రికేయుడు ఎం. ఎ. మాజిద్‌ను ఎన్నికల అధికారిగా నియ మించింది. ఉదయం 9 గంటల నుండి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక ఫలితాలను ఎన్నికల అధికారి ఎం.ఎ. మాజిద్ ప్లీనరీలో ప్రకటించారు. జాతీయ ఉపాధ్యక్షులుగా అమర్ మోహన్ ప్రసాద్ (బీహార్), వై.నరేందర్ రెడ్డి (తెలంగాణ), జాతీయ కార్యదర్శులుగా నరేంద్ర భరద్వాజ్ (ఉత్తర ప్రదేశ్), డి.ఎస్.ఆర్.సుభాష్ (తమిళనాడు) , పి. భాస్కర్ రెడ్డి (కర్ణాటక), కోశాధికారిగా బల్బీర్ సింగ్ జండు (పంజాబ్) ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా రవీందర్ సింగ్ (ఉత్తర ప్రదేశ్) , కే.సత్యనారాయణ (తెలంగాణ), కే. అజిత (తెలంగాణ) , నగునూరి శేఖర్ (తెలంగాణ) కూన అజయ్ బాబు , (ఆంధ్ర ప్రదేశ్) ఈ.ఎన్.రాజు (ఆంధ్ర ప్రదేశ్) , కుణాల్ జే. మాత్రే (మహారాష్ట్ర), మోహన్ రాజ్ శ్రీనివాసన్ (తమిళనాడు), బిందూ సింగ్ (పంజాబ్ అండ్ చండీఘర్), ఎం.పీ.మహారాజ (పాండిచ్చేరి), సి.ఎం.సాబిర్ అలీ (కేరళమ్), జయశ్రీ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్), వినీతా మండల్ హల్దర్ (ఛత్తీస్ ఘడ్), శివేంద్ర నారాయణ్ సింగ్ (బీహార్) టి. శ్రీనివాసరావు (న్యూఢిల్లీ), ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యక్ష పద్ధతిలో గతంలోనే ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ, సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ ప్లీనరీ వేదికపై ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు బాధ్యతల్లో ఉంటుంది.

నిర్మల్‌లో బాలికలపై అత్యాచారయత్నం

ఇద్దరు నిందితుల అరెస్టు

మన తెలంగాణ/నిర్మల్ ప్రతినిధి: నిన్న నిర్మల్ పట్టణంలోని సోఫినగర్ ప్రాంతంలో ఇద్దరు బాలికలను అపహరించి, అత్యాచార యత్నం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులు అబ్బాస్ ఖాన్, షేక్ కలీమ్ లను నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాల ప్రకారం... ఇద్దరు బాలికలను అపహరించి వారిపై అత్యాచార యత్నం చేయడానికి ప్రయత్నించినట్లు నిర్ధారణ కావడంతో, నిందితులపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయడమే కాకుండా, బాధిత బాలిక ఎస్సీ వర్గానికి చెందినది కావడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేశామని తెలిపారు. బాలికలను అపహరించి అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలపై నేరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ స్పష్టం చేశారు.

సుక్మా జిల్లాలో ఎన్‌కౌంటర్ పిపిసిఎం సభ్యుడు మృతి

మృతి చెందిన మావోయిస్టుపై 5 లక్షల రూపాయల రివార్డు

మన తెలంగాణ/చర్ల: ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్లాటూన్ నంబర్ 31 సెక్షన్ కమాండర్ మృతి చెందాడు. పోలంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఎదురు కాల్పుల్లో కమాండర్ ముచాకి కైలాస్ మృతి చెందాడు.ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య అడపాదడపా కాల్పులు కొనసాగుతున్నాయి .ఎదురు కాల్పుల విషయాన్ని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. సంఘటనా ప్రాంతం నుంచి మావోయిస్టు మృతదేహంతో పాటు ఒక ఆయుధాన్ని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతిచెందిన మావోయిస్టు ఐఇడీలు పేల్చడం , బలగాలపై దాడులు వంటి నేరాల్లో పాల్గొన్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇతనిపై ఐదు లక్షల రివార్డు ఉన్నట్లు చెప్పారు. మావోయిస్టులు లొంగిపోయేందుకు చివరి అవకాశం కొద్ది సమయం మాత్రమే మిగిలి ఉందని,హింసా మార్గాన్ని వీడాలని బస్తర్ ఐ జి సుందర్ రాజ్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

'మహాలక్ష్మి'తో మహిళలకు రూ.10వేల కోట్లు ఆదా

- ఇది తెలంగాణ ఆడబిడ్డల గెలుపు
- మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి వ్యాఖ్య



మన తెలంగా/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని ఆర్‌టిసి వెల్లడించింది. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల రవాణా ఛార్జీల మొత్తం నేటితో రూ. 10వేల కోట్ల మార్కును చేరుకుందని ఆర్‌టిసి అధికారికంగా ప్రకటించింది. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ప్రారంభమైందని, ఆర్‌టిసిలో మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి ద్వారా ఇప్పటి వరకు దాదాపు 290 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకొని మహిళలు 10వేల కోట్లు ఆదా చేసుకున్న సందర్భంగా మహిళలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు చిన్న చిన్న గ్రామాల నుండి పట్టణాలకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని, గ్రామాల నుండి నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాదులో చికిత్స చేసుకుంటున్నారని, కుటుంబంతో కలిసి దేవాలయాలకు వెళ్తున్నారని ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2023 డిసెంబర్ 9న పథకం ప్రారంభమై నేటి వరకు సుమారు 28 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్లకు పైగా జీరో (ఉచిత ప్రయాణం) టి కెట్లను మహిళా ప్రయాణికులు వినియోగించుకున్నట్లు ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి తెలిపారు. గతంలో రవాణా ఛార్జీల కోసం నెలకు సగటున రూ. 1,500 నుండి రూ. 2,500 వరకు వెచ్చించే సామాన్య, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినిలు, కూలీలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని, ఈ పొదుపు మొత్తం రాష్ట్రవ్యాప్తం గా రూ. 10 వేల కోట్లకు చేరడం మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. మహాలక్ష్మి అమలు తరువాత ఆర్‌టిసి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని, పథకం రాకముందు 40 శాతంగా ఉన్న మహిళల వాటా, ప్రస్తుతం 67 శాతానికి పైగా నమోదవుతోందని, ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నట్లు ఎండి వెల్లడించారు. మహిళలు ఉచితంగా ప్రయాణించిన టికెట్ల విలువను రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో ఆర్‌టిసికి చెల్లిస్తోంది. తద్వారా ఆర్‌టిసి ఆర్థిక బలోపేతం, సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు ఈ నిధులు కొంత వెసలుబాటును కల్గిస్తున్నాయని ఎండి నాగిరెడ్డి స్పష్టం చేశారు.

మహిళలకు స్మార్ట్ కార్డుల జారీ

మహాలక్ష్మి పథకాన్ని మరింత సరళతరం చేసేందుకు, కచ్చితమైన గణాంకాల కోసం త్వరలో చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల వ్యవస్థను అందుబాటులోకి తేనున్నట్లు ఎండి నాగిరెడ్డి చెప్పారు. ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరం లేకుండానే స్మార్ట్ కార్డులు ద్వారా మహిళల ఉచిత ప్రయాణం చేసేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడనుందని, పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ప్రవేశపెట్టడం జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

సత్తుపల్లిలో దుర్ఘటన

మన తెలంగాణ/సత్తుపల్లి: గేదెల మేపేందుకు వెళ్లి ఈత కోసం నీటి గుంటలో దిగి ఇద్దరు బాలురు మృతి చెందిన సంఘటన సత్తుపల్లి పట్టణ శివారులో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఒంటిపూడి దేవా (12) సంవత్సరాలు స్థానిక ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుండగా వేంసూరు మండలం కుంచపర్తి గ్రామానికి చెందిన వంగూరి నాగబాబు (12) తన అమ్మమ్మ ఎన్టీఆర్ నగర్లో ఉండగా వారి ఇంటి దగ్గర ఉంటూ ఆదివారం కావడంతో సత్తుపల్లి మున్సిపాలిటీ సమీపంలోని గేదలు మేపేందుకు వెళ్లి సరదాగా నీటి గుంటలో దిగి ఇద్దరి విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందాడు. హుటాహుటినా రంగంలోకి దిగిన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను రంగంలోకి దించి నీటి గుంటలో పడి మృతి చెందిన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 4 గంటలకు పైగా గాలింపు చేపట్టాగ ఇద్దరు మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలను శవ పంచనామా పరీక్ష కోసం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణ-ఉత్తర భారత్ పేరిట సిఎం కట్టుకథలు

- విభజన అనే కొత్త వాదన తెరపైకి
- మహిళా రిజర్వేషన్లకు బ్రేక్ వేసే కుట్ర
- బిజెపి ఒబిసి మోర్చా చీఫ్ లక్ష్మణ్ ఆరోపణ

మన తెలంగాణ/హైదరాబాద్: సిఎం రేవంత్‌రెడ్డి డీలిమిటేషన్, డివల్యూషన్, డిస్క్రిమినేషన్ పేరిట అసత్య కథనాలు అల్లుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఉత్తర-దక్షిణ విభజన అనే కొత్త వాదనను తెరపైకి తీసుకుని వచ్చారని బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. డీలిమిటేషన్ ప్రక్రియలో ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 50 శాతం సీట్ల పెంపు చేపడుతూ, దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తామని కేంద్ర హోం మంత్రి అమీత్ షా స్పష్టంగా చెప్పినప్పటికీ కాంగ్రెస్ ఎందుకు అడ్డుపడుతుందో చెప్పాలని ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో అన్నారు. గతంలో కాంగ్రెస్, డీఎంకే పార్టీలు జనాభా ప్రాతిపదికపై డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని చెప్పి ప్రక్రియను నిలిపివేశాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అదే అంశాన్ని వక్రీకరించి రాజకీయంగా మహిళల రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మహిళల సాధికారత దిశగా చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వం మహిళలకు సరైన రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. డీలిమిటేషన్ ప్రక్రియతో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుంది కాబట్టి కాంగ్రెస్ ఈ వర్గాల ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఉదాహరణకు 50 శాతం ప్రతిపాదన అమలు జరిగితే, లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 సీట్లు సుమారు 816కి పెరిగే అవకాశముందని, దీని ద్వారా ఎస్సీ, ఎస్టీ ప్రాతినిధ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో కూడా అసెంబ్లీ సీట్లు 119 నుంచి సుమారు 179కి, పార్లమెంట్ సీట్లు 17 నుంచి సుమారు 26కి పెరిగే అవకాశం ఉందన్నారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఎస్సీ, ఎస్టీ ప్రాతినిధ్యం మరింత పెరిగి సామాజిక న్యాయం బలపడుతుందని, అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ దీనిని అడ్డుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు.

భక్తజనంతో పోటెత్తిన యాదాద్రి

లక్ష్మీ నరసింహస్వామి నిత్యరాబడి రూ.41.39 లక్షలు

మనతెలంగాణ/యాదగిరిగుట్ట : శ్రీపంచ నారసింహ క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కొండపైన, కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి దర్శన క్యూ లైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం, టికెట్ల విక్రయ కేంద్రాలు, పార్కింగ్, బస్టాండ్, పుష్కరిణి, తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏకాదశిని పురస్కరించుకొని నరసింహ స్వామికి పుష్పార్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పార్చనను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి, అమ్మవార్ల కు రూ. 41,39,620 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

NIDO హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు ఎడెల్‌వైస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) రిజిస్టర్డ్ కార్యాలయము: 5వ అంతస్తు, టవర్ 3, బి-వింగ్, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్ల (వెస్ట్), ముంబయి-400070. ప్రాంతీయ కార్యాలయం: 4వ అంతస్తు, జానకి అవెన్యూ, నం. 1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం. 2, బేగంపేట, హైదరాబాద్-500016.

బి.-వేలం - 15 రోజుల చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద ఇ-వేలం ద్వారా అమ్మకం

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతకు మరియు హామీదారుకు ఈ